సాక్షి
గుంటూరు

మంగళవారం । 27 । ఫిబ్రవరి । 2024



ఈవీఎం గోడౌన్ల పరిశీలన

గుంటూరు వెస్ట్ : ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఈవీఎం గోడౌన్లను అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ అధికారి ఎంఎన్ హరేంద్ర ప్రసాద్, జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి పరిశీలించారు.



బైజూస్ ద్వారా బోధించాలి

నకరికల్లు: బైజూస్ ద్వారా బోధన చేస్తే మంచి ఫలితాలు వస్తాయని పాఠశాల విద్య జేడీ బి.లింగేశ్వర్‌రెడ్డి సూచించారు. స్థానిక ఉన్నత పాఠశాలను సోమవారం సందర్శించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 516.50 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

సీఎం సభ ఏర్పాట్లు పరిశీలించిన తలశిల

సాక్షి ప్రతినిధి, గుంటూరు: మంగళగిరి సికే కన్వెన్షన్ హాల్ లో మంగళవారం జరగనున్న 'మేం సిద్ధం.. మా బూత్ సిద్ధం' సమావేశం ఏర్పాట్లపై ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి సోమవారం రాత్రి సమీక్షించారు. గుంటూరు అదనపు ఎస్పీ కొల్లి శ్రీనివాసరావు, ముఖ్యమంత్రి భద్రత సిబ్బందితో కలిసి భద్రత ఏర్పాట్లు, సభ, భోజనం ఏర్పాట్లపై చర్చించారు. 175 నియోజకవర్గాల నుంచి ప్రజాప్రతినిధులు, నేతలు వస్తున్నందున వారికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు

పేదల ఇళ్ల రిజిస్ట్రేషన్లు త్వరగా పూర్తిచేయాలి

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: జగనన్న కాలనీల్లోని పేదల ఇళ్ల రిజిస్ట్రేషన్లు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నుంచి నిర్వహించిన వర్చువల్ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మంగళవారం సాయంత్రానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కావాలన్నారు. ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల్లో పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్ల అప్‌డేట్‌లు అధికారులు పరిశీలించాలని చెప్పారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరైన ప్రతి ఒక్కరికీ అందించాలన్నారు. రీ సర్వే త్వరగా పూర్తి చేయాలన్నారు. జగనన్న పాలవెల్లువ పథకం మూడో విడతలో ప్రతి కేంద్రంలోనూ కనీసం 150 లీటర్లు సేకరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్‌ఓ పెద్ది రోజా, అధికారులు పాల్గొన్నారు.

వడ్డేశ్వరం జడ్పీ పాఠశాల సందర్శన



తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలికల జూనియర్ కళాశాలను సోమవారం ఆంధ్రప్రదేశ్ విద్యా సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ మాచర్ల హుస్సేన్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అసంపూర్తిగా నిలిచిపోయిన తరగతి గదులను వెంటనే పూర్తి చేసి విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని పాఠశాల హెచ్ఎం జి.సుబ్బారావుకు సూచించారు. ఉపాధ్యాయులు బుజ్జిబాబు, ఆనందరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

హీరా ఇస్లామిక్ స్కూల్‌కు ఎమ్మెల్యే ఆర్కే విరాళం



మంగళగిరి: నగరంలోని హీరా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న హీరా ఇస్లామిక్ స్కూల్‌లో తాగునీటి వసతి, మౌలిక సదుపాయాలు, డిజిటల్ క్లాస్ రూమ్ నిమిత్తం మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) రూ.2లక్షల విరాళాన్ని సోమవారం వైఎస్సార్ సీపీ పట్టణ నాయకుల చేతుల మీదుగా ఇప్పించారు. కార్యక్రమంలో స్కూల్ నిర్వాహకులు ఆలీబాషాఖాన్, వైఎస్సార్ సీపీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, ఎండీ ఇక్బాల్, ఆకురాతి రాజేష్, ఎండీ ఫిరోజ్, రాచకొండ వెంకటేశ్వరరావు, దొడ్డక కృష్ణ, కుంచాల కిషోర్, మల్లవరపు సుధారాణి, సంకె సునీత పాల్గొన్నారు.

సంచార పశు వైద్య సేవ వాహనాల్లో డ్రైవర్ పోస్టులు

గుంటూరు మెడికల్ : గుంటూరు జిల్లాలో సంచార పశు వైద్య సేవ వాహనాల్లో డ్రైవర్ పోస్టుల భర్తీకి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మేనేజర్ పాతపాటి బాల చంద్రుడు ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి, మంగళగిరి, దుగ్గిరాల, పెదకాకానిలో డ్రైవర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ పోస్టులకు డ్రైవింగ్‌లో 2 లేదా 3 సంవత్సరాల అనుభవంతో హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా మేనేజర్ బాల చంద్రుడు మొబైల్ నంబర్ 9032876888లో సంప్రదించాలన్నారు.

కురుక్షేత్ర సంగ్రామానికి సిద్ధం



గుంటూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సిద్ధం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి విడదల రజిని, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ తదితరులు

- వైఎస్సార్ సీపీని 175 స్థానాల్లో గెలిపించేందుకు ప్రజలు సిద్ధం
- జన ప్రవాహాన్ని చూసి ఇప్పటికే ప్రతిపక్షాలకు వణుకు
- మార్చి 3న సిద్ధం సభకు తరలిరండి
- చంద్రబాబునాయుడుకు పార్టీలతో పొత్తు జగనన్నకు ప్రజలతోనే పొత్తు
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- సిద్ధం సభ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

పట్నంబజారు: ఎన్నికల కురుక్షేత్ర సంగ్రామం జరగబోతోంది..కౌరవులను తలపించేలా.. ప్రజలను వంచించేందుకు తెలుగుదేశం, తోకపార్టీలు.... సిద్ధమవుతున్నాయి.. ఎవరు ఎన్ని పద్మవ్యూహాలు పన్నినా ప్రజల పక్షాన ధర్మపోరాటానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని.. ఆయనతో కలిసి పోరాడేందుకు ప్రతి ఒక్కరం సిద్ధమవ్వాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో 175 కు 175 స్థానాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. గుంటూరు చంద్రమౌళి నగర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం సిద్ధం సభ పోస్టర్లను ఆవిష్కరించారు. మంత్రి రజినితో పాటు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, మార్కెట్‌యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, నియోజకవర్గ పరిశీలకుడు రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము), డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు పోస్టర్‌ను ఆవిష్కరించారు.

మేదరమెట్లలో జన సునామీనే..

ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తు.చ. తప్పకుండా అమలు చేసి... మేలు జరిగితేనే ఓటు వేయండి అని అడిగే ధైర్యం రాష్ట్రంలో సీఎం వైఎస్ జగనన్నకు తప్ప మరెవ్వరికి లేదన్నారు. ఇప్పటికే మూడు చోట్ల సిద్ధం సభలు జరిగాయని ప్రతి సభకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారని, జనప్రవాహాన్ని చూసి టీడీపీ నాయకులకు వణుకు పుడుతోందని ఎద్దేవా చేశారు. మార్చి 3వ తేదీన మేదరమెట్లలో జరిగే సిద్ధం సభకు పెద్ద ఎత్తున జనప్రవాహం తరలిరానుందన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి భారీ స్థాయిలో పార్టీ శ్రేణులు, ప్రజలు తరలివెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. చంద్రబాబునాయుడికి ఓటమి భయం పట్టుకుని రాష్ట్రంలోని అన్ని పార్టీలతో పొత్తులు పెట్టుకుంటున్నారని, జగనన్న పొత్తు మాత్రం ప్రజలతోనే అని స్పష్టం చేశారు.

పార్టీ శ్రేణులంతా తరలిరావాలి

ఎమ్మెల్యే మద్దాళి గిరి

మార్చి 3వ తేదీన జరగనున్న సిద్ధం సభకు పార్టీ శ్రేణులంతా తరలిరావాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరి తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి బిడ్డలా పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థిని రజినమ్మను భారీ మెజారిటీతో గెలిపించేందుకు పాటుపడాలని పిలుపునిచ్చారు. అనంతరం పోస్టర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, మహిళా విభాగం నగర అధ్యక్షురాలు గనిక ఝాన్సీ, అంగడి శ్రీను ఆయా డివిజన్‌ల కార్పొరేటర్‌లు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ నేతలు, పలు కార్పొరేషన్‌ల చైర్మన్‌లు, డైరక్టర్లు, జేసీఎస్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, ఆయా విభాగాల నాయకులు పాల్గొన్నారు.

అమృత్ భారత్ స్టేషన్లకు శంకుస్థాపన

- వర్చువల్‌గా పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ
- గుంటూరు రైల్వే స్టేషన్‌లో శిలాఫలకం ఆవిష్కరణ
- రైల్వేలో విప్లవాత్మక మార్పులు : రాజ్యసభ సభ్యులు అయోధ్యరామిరెడ్డి

లక్ష్మీపురం: అమృత్ భారత్ స్టేషన్ల కింద సౌత్ సెంట్రల్ రైల్వే పరిధిలోని గుంటూరు డివిజన్ పరిధిలోని రైల్వేస్టేషన్ల పునరాభివృద్ధికి దేశ ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయడం చాలా సంతోషంగా ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యులు అయోధ్య రామిరెడ్డి అన్నారు. స్థానిక గుంటూరు రైల్వే స్టేషన్‌లోని అమృత్ భారత్ పథకం ద్వారా గుంటూరు డివిజన్‌లోని బాపట్ల, గుంటూరు, మంగళగిరి, నరసరావుపేట, సత్తెనపల్లి స్టేషన్ల పునరాభివృద్ధి కార్యక్రమం డీఆర్ఎం రామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఒకటో నంబర్ ప్లాట్‌ఫామ్‌పై ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ గత పది సంవత్సరాలుగా రైల్వేలో విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. ఏపీలో రైల్వే స్టేషన్ల అభివృద్ధి కోసం రూ.60వేల కోట్లు ఖర్చు పెట్టారని తెలిపారు. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని నిత్యం ప్రయాణికులతో కిటకిటలాడే గుంటూరు, మంగళగిరి, సత్తెనపల్లి, నరసరావుపేట, బాపట్ల స్టేషన్‌ల పునరాభివృద్ధికి శంకుస్థాపన జరగడం శుభ సూచకం అన్నారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 554 అమృత్ స్టేషన్లకు శంకుస్థాపన చేసిన దేశ ప్రధాని నరేంద్రమోదీకి ధన్యవాదాలు తెలిపారు. డీఆర్ఎం రామకృష్ణ మాట్లాడుతూ అమృత్ భారత్ పథకం ద్వారా బాపట్ల స్టేషన్‌కు రూ.17.13 కోట్లు, గుంటూరు స్టేషన్‌కు రూ.15.80 కోట్లు, మంగళగిరికి రూ.13.63 కోట్లు, నరసరావుపేట రూ.11.30 కోట్లు, సత్తెనపల్లి స్టేషన్‌కు రూ.11.30 కోట్లు కేటాయించారన్నారు. ఈ నిధులతో ఆయా స్టేషన్లలో వసతులు కల్పిస్తామని తెలిపారు. బీజేపీ జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్ మాట్లాడారు. డివిజన్ అధికారులు, సిబ్బంది, ప్రయాణికులు, ఏడీఆర్ఎం శ్రీనివాస్, సైమన్, తదితరులు పాల్గొన్నారు.

వేములూరిపాడులో ఆర్‌యూబీ ప్రారంభం..

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామ శివారులోని రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తికావడంతో దానిని వినియోగంలోకి తీసుకువచ్చినట్లు దక్షిణ మధ్యరైల్వే ఏడీఈ జి.రత్నం అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నూతనంగా పలు రైల్వేస్టేషన్‌లు, రాష్ట్రంలో 34 ఆర్‌ఓబీలు, 59 ఆర్‌యూబీలను అమృత్ భారత్ స్కీం ద్వారా ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారని చెప్పారు. రైల్వే అధికారులు సురేష్, గంగాదర్, పి.సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.



గుంటూరు రైల్వేస్టేషన్ తూర్పు వైపు శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ ఏసురత్నం, డీఆర్ఎం రామకృష్ణ

నేటి నుంచి టెట్

- ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్
- జిల్లాలో తొమ్మిది కేంద్రాలు ఏర్పాటు
- హాజరుకానున్న 17,258 మంది అభ్యర్థులు



ఆన్‌లైన్ టెస్ట్‌కు హాజరైన అభ్యర్థులు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ నియామకాలకు అర్హత కల్పించే టీచర్స్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్) మంగళవారం నుంచి జరగనుంది. నేటి నుంచి మార్చి 6వ తేదీవరకు జరగనున్న పరీక్షలకు గుంటూరు జిల్లావ్యాప్తంగా దరఖాస్తు చేసిన 17,258 మంది అభ్యర్థులకు వివిధ ఇంజినీరింగ్ కళాశాలల్లో తొమ్మిది పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అభ్యర్థులు కనీసం గంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంది. టెట్‌కు హాజరుకానున్న అభ్యర్థులు హాల్ టికెట్‌పై ముద్రించిన నియమావళిని క్షుణ్ణంగా చదువుకుని, హాజరు కావాలి. కంప్యూటర్ బేస్డ్ విధానంలో ఆన్‌లైన్‌లో ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టులలో జరగనున్న పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈఓ పి.శైలజ తెలిపారు. ఆయా కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం నుంచి 5 గంటల వరకు జరగనున్న పరీక్షలకు ఆయా కేంద్రాల పరిధిలో డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. టెట్‌కు సంబంధించి అభ్యర్థులకు ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేసి, సమస్యలను పరిష్కరించేందుకు డీఈఓ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కె.లావణ్య, అసిస్టెంట్ డైరెక్టర్ (96184 54467), జగదీష్ అగర్వాల్, సూపరింటెండెంట్ (95733 82616), టి.రామయ్య, సీనియర్ అసిస్టెంట్ (99513 94109) లను సంప్రదించాలని సూచించారు.

వంశీ వండర్

6 బంతుల్లో 36 పరుగులు.. 48 బంతుల్లో శతకం

- ఆంధ్ర క్రికెట్‌లో యువ సంచలనం
- ఒకే ఓవర్‌లో 6 సిక్స్‌లు కొట్టిన క్రికెటర్‌గా రికార్డు
- డొమెస్టిక్ క్రికెట్‌లో తక్కువ బంతుల్లో వేగవంతమైన సెంచరీ
- గుంటూరుకు చెందిన క్రికెటర్ మామిడి వంశీకృష్ణ
- భారత జట్టులో స్థానమే లక్ష్యమంటున్న కీపర్ కమ్ బ్యాట్స్‌మెన్



భారత జట్టు వికెట్ కీపర్ కేఎస్ భరత్‌తో వంశీకృష్ణ

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఫిబ్రవరి 18వ తేదీ.. వైఎస్సార్ కడప జిల్లాలోని వైఎస్సార్ క్రికెట్ స్టేడియం. రైల్వేస్ – ఆంధ్ర జట్ల మధ్య 4 రోజుల క్రికెట్ మ్యాచ్. సహజంగా టెస్ట్ మ్యాచ్‌లలో పరుగులు కొంత నెమ్మదిగానే సమోదవుతాయి. అయితే ఆ రోజు ఒక రికార్డు నమోదవుతుందని ఎవ్వరూ ఊహించలేదు. గుంటూరుకు చెందిన రైట్ హ్యాండ్ బ్యాట్స్‌మెన్ మామిడి వంశీకృష్ణ బ్యాటింగ్‌కు దిగిన కొంతసేపటికి రైల్వేస్ స్పిన్నర్ దమన్‌దీప్ సింగ్ బౌలింగ్‌కు దిగాడు. అంతే తొలి బంతిని సిక్సర్‌గా మలచిన వంశీ కృష్ణ వరుసగా ఆ ఓవర్‌లో ఆరు సిక్స్‌లు కొట్టి గ్యాలరీలను మోతమోగించాడు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఒకే ఓవర్‌లో ఆరు సిక్స్‌లు కొట్టిన మొదటి బ్యాట్స్‌మెనే కాకుండా ఇండియాలో 4వ వాడిగా (రవిశాస్త్రి, గైక్వాడ్, యువరాజ్ సింగ్‌ల తర్వాత) నమోదయ్యాడు. అదొక్కటే కాదు ఆ మ్యాచ్‌లో 10 సిక్సర్లు, 8 బౌండరీలతో కేవలం 48 బంతుల్లోనే సెంచరీ చేసి డొమెస్టిక్ క్రికెట్‌లోనే వేగవంతమైన శతకం నమోదు చేశాడు. (ఈ మ్యాచ్ డ్రాగా ముగిసింది)

విభిన్న ఆటతీరుతో దూకుడు..

గుంటూరుకు చెందిన 22 ఏళ్ల వంశీకృష్ణ సుమారు పదేళ్ల క్రితం అంటే 11 ఏళ్ల వయస్సులో సరదాగా సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంపులో అరంగేట్రం చేశాడు. బాబాయ్ మోహన్‌రావు అప్పటికే రాష్ట్ర క్రికెటర్ కావడంతో వంశీకృష్ణను ప్రోత్సహించాడు. తొలుత సరదాగా ప్రారంభించిన క్రికెట్ ఆ తర్వాత కోచ్ రఘు చొరవతో త్వరగానే ఒంటబట్టించుకున్నాడు. ఇక రాష్ట్రస్థాయి మ్యాచ్‌లు ఆడేసరికి తన ఆటలో దూకుడు పెంచాడు. బ్యాటింగ్, వికెట్ కీపింగ్‌తో ఆంధ్ర జట్టులో అన్ని ఫార్మెట్లలోనూ కీలకంగా ఎదిగాడు. ఆ తర్వాత మస్తాన్ రెడ్డి, ఆర్‌వీ ప్రసాద్, కృష్ణారావుల సారథ్యంలో అన్ని విభాగాల్లోనూ ప్రతిభ చాటుతున్న సమయంలోనే 2021లో ఆంధ్ర రంజీ జట్టులో స్థానం దక్కించుకున్నాడు.

మలుపుతిప్పిన సీకే నాయుడు ట్రోఫీ...

ఈ ఏడాది జరిగిన అండర్–23 సీకే నాయుడు ట్రోఫీ సీజన్‌లో కేవలం 6 మ్యాచ్‌లలోనే మూడు సెంచరీలు, రెండు అర్థ శతకాలతో 550 పరుగులు చేశాడు. దానికి ముందు అండర్–23 స్టేట్ జట్టుకు కెప్టెన్‌గా తనదైన ముద్ర వేశాడు. సయ్యద్ ముస్తాఖ్ ఆలీ ట్రోఫీ, విజయ్ హజారే ట్రోఫీలో ఆడాడు. ప్రస్తుతం ఆంధ్ర యువ జట్టులో నమ్మదగిన బ్యాట్స్‌మెన్‌గా, వికెట్ కీపర్‌గా మారాడు. గత మూడు సీజన్‌ల నుంచి రంజీ జట్టులో చోటు ఉన్నప్పటికీ మ్యాచ్‌లు ఆడే అవకాశం రాలేదు. వచ్చే ఏ అవకాశాన్ని వదులుకోవడానికి ఇష్టపడని వంశీకృష్ణ తప్పకుండా భారత్ జట్టులో స్థానం దక్కించుకుంటాడని అతని కోచ్‌లు అంటున్నారు.

భారత జట్టులో చోటే లక్ష్యం..

గత ఐదేళ్ల నుంచి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ పెద్దలు శరత్‌చంద్రా రెడ్డి, గోపీనాథ్ రెడ్డిల ప్రోత్సాహంతో రాష్ట్రంలో క్రికెట్‌కు వసతులు పెరిగాయి. మెరుగైన శిక్షణ లభిస్తుంది. దీంతో యువతలో తీవ్రమైన పోటీ ఏర్పడింది. అవకాశం వస్తే సద్వినియోగం చేసుకుని నిరూపించుకోవాలి. నాకు ఇప్పటివరకు వచ్చిన అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకున్నా. కడపలో ఒకే ఓవర్‌లో కొట్టిన ఆరు సిక్స్‌లు, ఫాస్టెస్ట్ సెంచరీ ఎప్పటికీ మరచిపోలేను. భారత జట్టులో చోటే ప్రధాన లక్ష్యంగా సాధన చేస్తున్నాను. కుటుంబ సభ్యులు, జిల్లా క్రికెట్ అసోసియేషన్ సహకారం మరువలేనిది.

– మామిడి వంశీ కృష్ణ, ఆంధ్ర రంజీ క్రికెటర్

స్పందన అర్జీలపై పర్యవేక్షణ అవసరం

- జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి
- స్పందనలో 180 అర్జీలు స్వీకరణ



సమస్యలు ఆలకిస్తున్న జాయింట్ కలెక్టర్ రాజకుమారి

గుంటూరు వెస్ట్: స్పందనలో వస్తున్న అర్జీలపై ఆయా శాఖాధికారులు నిరంతరం పర్యవేక్షిస్తుండాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ ప్రతి నెలా రెండుసార్లు వివిధ శాఖల్లో వస్తున్న అర్జీలు ఎన్ని, సంపూర్ణంగా పరిష్కరించామా లేదా చూసుకోవాలన్నారు. వీలైనంత వరకు అర్జీలు వచ్చిన 48 గంటల్లోనే పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వాటిని తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అర్జీలు అపరిష్కృతంగా ఉంచితే చర్యలు తప్పవన్నారు. ముఖ్యంగా రీ ఓపెన్ వరకు తేవద్దని వెల్లడించారు. అనంతరం వచ్చిన 180 అర్జీలను డీఆర్‌ఓ పెద్ది రోజా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మీ కుమారి, కె.స్వాతి, ఆర్డీఓ పి.శ్రీకర్, జిల్లా అధికారులు పరిశీలించారు.


కేసు వెనక్కు తీసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారు



సంజీవయ్య నగర్‌లోని పినపాటి ప్రభుదాస్ మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలో మా పిల్లలు చదువుతున్నారు. అక్కడి ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ విచక్షణారహితంగా మా పిల్లలను చితకబాదాడు. మేము కేసు పెడితే రాజీ చేసుకోమని బెదిరస్తున్నారు. సదరు ఉపాధ్యాయుడిని శిక్షించి మాకు న్యాయం చేయాలని మనవి..

– ప్రశాంత్, భారతి, లలిత, గుంటూరు

దేవాలయానికి ఇబ్బందిగా మారుతుంది



పొన్నూరులోని సాక్షి భావన్నారాయణ దేవస్థానం నుంచి జీబీసీ రోడ్డులోని గాంధీ బొమ్మ సెంటర్ వరకు సెంటర్ డివైడర్‌ను నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇది నిర్మిస్తే దేవాలయానికి ఇబ్బందికరంగా మారుతుంది. రథసప్తవాలతోపాటు అనేక కార్యక్రమాలకు విఘాతం ఏర్పడుతుంది. అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలి.

– బీజేపీ యువ మోర్చా నాయకులు

పేదల చెంతకు కార్పొరేట్ వైద్యం

- అందుబాటులోకి తెచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దే
- వైఎస్సార్ సీపీ నరసరావుపేట లోక్‌సభ సమన్వయకర్త అనిల్‌కుమార్ యాదవ్
- బ్రాహ్మణపల్లిలో డాక్టర్ వైఎస్సార్ మెడికల్ కళాశాల ఫేజ్–1లో భాగంగా 100 పడకల ఆస్పత్రి ప్రారంభం



రిబ్బన్ కట్ చేసి ఆస్పత్రిని ప్రారంభిస్తున్న అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే కాసు, ఎమ్మెల్సీ ఏసురత్నం

పిడుగురాళ్లరూరల్: పల్నాడు ప్రాంత ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారని వైఎస్సార్ సీపీ నరసరావుపేట లోక్‌సభ సమన్వయకర్త అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. మండలంలోని కామేపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో బ్రాహ్మణపల్లి గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ మెడికల్ వైద్యశాలలో ఫేజ్ 1లో భాగంగా 100 పడకల ఆస్పత్రిని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గురజాల శాసన సభ్యులు కాసు మహేష్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నర్సరావుపేట లోక్‌సభ సమన్వయకర్త అనిల్‌కుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నంలు హాజరయ్యారు. ఈసందర్భంగా అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ప్రజల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని 17 మెడికల్ కాలేజీలను తీసుకొచ్చిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని ఆయన అన్నారు. రాబోయే రోజుల్లో సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని, శాసన సభ్యులుగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, పార్లమెంట్ సభ్యుడిగా తనను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ మూడు నెలల్లో పూర్తిస్థాయిలో సిద్ధం కానుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, ఎంపీపీ అల్లు సత్యవతి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ సాతులూరి బాబు, గార్లపాటి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

3న పల్స్ పోలియో

జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి

గుంటూరు వెస్ట్: చిన్నారుల బంగారు భవిష్యత్ కోసం తల్లిదండ్రులు పోలియో చుక్కలు వేయించాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ వచ్చే నెల 3వ తేదీ నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమం సమష్టిగా విజయవంతం చేయాలన్నారు. 0–5 సంవత్సరాల వయస్సున్న చిన్నారులు 2,12,027 మందిని గుర్తించామన్నారు. వీరికి నూరు శాతం వేయాలన్నారు. పోలియో మహమ్మారి దేశంలో లేకుండా నిర్మూలించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. జిందాల్ పవర్ ప్లాంట్ సమీపంలో ర్యాట్ పిక్కర్స్ పిల్లలు ఉన్నారని, తాడేపల్లిలోని ముగ్గురోడ్డు సాయిబాబా మందిరానికి ఎదురుగా ఉన్న ప్రాంతంలోనూ చిన్నారులను గుర్తించి వేయించాలన్నారు. జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ పల్స్‌పోలియో కార్యక్రమానికి 950 బూత్‌లను, 92 మొబైల్ బృందాలను ఏర్పాటు చేసామన్నారు. వ్యాక్సినేటర్లుగా 3612 మందిని వినియోగిస్తున్నామన్నారు.

13,250 పోలియో వైల్స్‌ను సిద్ధం చేశామన్నారు. మార్చి 3న చుక్కలు వేయించుకోని చిన్నారులను గుర్తించి మరుసటి రోజు వారి ఇంటికి వెళ్లి వేస్తామన్నారు. దీనిపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుందన్నారు. అనంతరం పోలియో చుక్కల ప్రయోజనాలను వివరించే ప్రత్యేక పోస్టర్‌ను జేసీతో పాటు డీఆర్వో పెద్ది రోజా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మీ కుమారి, కె.స్వాతి, ఆర్డీఓ పి.శ్రీకర్, డాక్టర్ విజయలక్ష్మి, ఎన్‌సీడీ పీఓ డాక్టర్ శ్రావణ్ బాబు, డీపీఎంఓ డాక్టర్ రత్న మన్మోహన్ అధికారులు ఆవిష్కరించారు.

తాడేపల్లిలో టీడీపీ కవ్వింపు చర్యలు

- వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలపై టీడీపీవి ఏర్పాటు
- తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న సందీప్ తదితరులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లి అమరావతి కరకట్టవెంబడి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పేదప్రజల కోసం ప్రవేశపెట్టిన నవరత్నాల ఫ్లెక్సీలను వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాటు చేశారు. ఆ ఫ్లెక్సీలపైన కొంతమంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ ఫ్లెక్సీలు అతికించడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన తాడికొండ నియోజకవర్గ నాయకులు శృంగారపాటి సందీప్ వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలు తొలగించి ఐరన్ ఫ్రేమ్‌లు తొలగించిన సంఘటనపై సోమవారం తాడేపల్లి పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ ఐరన్ బోర్డులు తయారు చేసి ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే ఐరన్ బోర్డులను సైతం దొంగిలించి ఆ స్థానంలో టీడీపీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని, అంతేకాకుండా ఫ్లెక్సీలు మేం తొలగించామంటూ ఫిర్యాదు చేశారని, ఎవరైతే టీడీపీ ఫ్లెక్సీలు తొలగించారని ఫిర్యాదు చేశారో వారిని విచారిస్తే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీలను ఎవరు తొలగించారు? ఐరన్ ఫ్రేమ్‌లు ఎవరు దొంగిలించారన్న విషయాలు బయటకు వస్తాయని, పోలీసులు విచారణ చేయాలని సందీప్ కోరారు. ఫిర్యాదు అందజేసిన వారిలో పి.వి. రమణారెడ్డి, బుర్రా వెంకట శివారెడ్డి, ఆలోకం సురేష్, ఉన్నారు.

నేటి నుంచి సర్పంచ్‌లు, కార్యదర్శులకు వర్క్‌షాప్‌లు

గుంటూరు ఎడ్యుకేషన్: బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ఆధ్వర్యంలో గ్రామ పంచాతీయల సర్పంచ్‌లు, కార్యదర్శులకు ఈనెల మంగళవారం నుంచి మార్చి 7వ తేదీ వరకు రెండు బ్యాచ్‌లుగా జిల్లాస్థాయిలో వర్క్‌షాప్‌లను నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో ఎన్ఎస్‌వీబీ వసంత రాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఆర్ అండ్ ఆర్‌డీ శాఖ ముఖ్య కార్యదర్శి విడుదల చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఈనెల 27 నుంచి మార్చి ఒకటి, మార్చి నాలుగు నుంచి 7వ తేదీ వరకు రోజుకు రెండు బ్యాచ్‌లు చొప్పున శిక్షణ పూర్తి చేయాల్సి ఉందన్నారు. గుంటూరు జిల్లాలోని సర్పంచ్‌లు, కార్యదర్శులకు జెడ్పీ సమావేశ మందిరంలోనూ, పల్నాడు జిల్లా పరిధిలోని వారికి నరసరావుపేట మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరం, బాపట్ల జిల్లా వారికి బాపట్లలో మండల పరిషత్ సమావేశ మందిరంలో శిక్షణా కార్యక్రమాలను నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని ఆయా జిల్లాల పంచాయతీ అధికారులను ఆదేశించారు.

నేడు క్లాప్, షెడ్ మిత్రాలు, ఎన్జీవోలకు సన్మానం

ఐటీసీ ఆధ్వర్యంలో సెర్ప్ అండ్ ఫినిష్ ఎన్జీవో సంస్థలు సంయుక్తంగా ఎస్‌డబ్ల్యూఎం కార్యక్రమ అమల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్లాప్, షెడ్ మిత్రాలతో పాటు, ఎన్జీవో సంస్థల ప్రతినిధులకు జిల్లాస్థాయిలో సన్మాన కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం 10 గంటలకు జెడ్పీలో నిర్వహిస్తున్నట్లు సీఈవో తెలిపారు.

డొంక రహదారుల అభివృద్ధికి నిధులు

- రెండు నెలల్లో పూర్తి చేయాలి
- ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అయోధ్య రామిరెడ్డి

కొల్లిపర: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిలో భాగంగా తెనాలి నియోజక వర్గంలోని ప్రతీ గ్రామంలో డొంక రోడ్ల అభివృద్ధికి కావల్సిన నిధులు ఇవ్వనున్నట్లు ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం మండల కేంద్రమైన కొల్లిపర గ్రామంలో ఇటీవల ఎంపీ నిధులు రూ.20 లక్షలతో హిందూ శ్మశాన వాటికలో అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి కావడంతో తెనాలి శాసన సభ్యులు అన్నాబత్తుని శివకుమార్‌తో కలసి ఆయన వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు బాధ్యతగా తీసుకుని ప్రతీ డొంక రోడ్డు రానున్న రెండు నెలల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. అవసరమైన మేరకు మౌలిక సదుపాయాలు కల్పించటం జరుగుతుందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గత ఎన్నికల్లో ప్రజలకు చెప్పిన ప్రతి సంక్షేమం రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి అందించటం జరిగిందన్నారు. కొల్లిపర మండలంలో ఎటువంటి సహాయం కావల్సి వచ్చినా ఎప్పుడూ తాను సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఇంటికీ ఇంతగా సంక్షేమం అందిస్తున్న ముఖ్యమంత్రి జగనన్నని రానున్న ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా ఎన్నుకొని ఆయనకు మనం అందరం మంచి బహుమతి ఇద్దామన్నారు. తెనాలి శాసన సభ్యులను మళ్లీ కొల్లిపర మండలం నుంచి అఖండ మోజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మావతి, కళ్ళం వీరారెడ్డి, నెర్ల కుటుంబరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మిక్స్‌డ్ టెన్నిస్ విజేతలు వీరే



గుంటూరు వెస్ట్ (క్రీడలు): వీవీవీ హెల్త్ హబ్, గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో సోమవారం స్థానిక స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులో జరిగిన ఏపీ స్టేట్ టెన్నిస్ అండర్–16 మిక్స్‌డ్ సింగిల్స్ పోటీల్లో ఎం.ప్రణీత విజేతగా నిలువగా రన్నర్‌గా హితేష్ నిలిచాడు. గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 30 మంది పాల్గొన్నారన్నారు. అండర్–10, 12, 14 విభాగాల్లో వరుసగా యు.శౌర్యారామ్, టి.రోషన్, ఎస్ఐ హితేషలు విజేతలుగా నిలిచారన్నారు. విజేతలకు రేమాండ్స్ షోరూమ్ అధినేత టి.అరుణ్ కుమార్, ప్రసాద్‌లు బహుమతులు అందజేశారు.

స్పందనలో ఘొల్లుమన్న ట్రస్ట్ బాధితులు

- వివరాలు తెలుసుకున్న ఎస్పీ
- రియల్ మోసంపై మరో ఇద్దరు ఫిర్యాదు


సమస్య అలకిస్తున్న జిల్లా ఎస్పీ తుషార్ డూడీ

నగరంపాలెం: ట్రస్ట్ పేరుతో పెద్ద మొత్తంలో దోపిడీకి పాల్పడ్డారని పలువురు బాధితులు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాల్‌లో జరిగిన జగనన్నకు చెబుదాం (స్పందన)లో ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదిదారుల బాధలను అలకించారు. అనంతరం వారి సమస్యలపై సబ్ డివిజన్లల్లోని పోలీస్ అధికారులతో మొబైల్‌ఫోన్, వీసీ ద్వారా మాట్లాడారు. జిల్లా ఏఎస్పీలు జీవీ.రమణమూర్తి (పరిపాలన), ఎ.శ్రీనివాస రావు (క్రైం), డీఎస్పీలు బీవీనాయుడు (ట్రాఫిక్), సుబ్బారావు (దిశ) కూడా బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు.

పసిడి ఆశ చూపి..

సుమారు మూడేళ్ల క్రితం ఫిరంగిపురం అమీనాబాద్ వాసి ఒక ట్రస్ట్‌ను నెలకొల్పగా, బాలాజీనగర్‌కు చెందిన మహిళ, సంగడిగుంటకు చెందిన ఒకరు పనిచేసే వారు. రూ.10ల సభ్యత్వం కార్డులు అందించారు. ఇక సరకులతో కూడిన స్టోర్‌లను మంగళదాస్‌నగర్‌లో,నెహ్రూనగర్ రోడ్‌లో ఏర్పాటు చేశారు. దీంతో స్థానిక రోజు వారీ కూలీలు కుటుంబ సభ్యులకు తెలియకుండా చెల్లించారు. నిత్యావసర సరకులతోపాటు ఇంటి గృహోపకరాణలు, బంగారు అభరణాలను ఆశ చూపారు. జీఎస్టీ, ఇతరత్రా పన్నుల్లేకుండా బంగారు అభరణాలు యిస్తామని ఆశ చూపగా ఎక్కువ మంది ఆకర్షితులయ్యారు. సుమారు 3 కోట్లతో ఉడాయించారు. చర్యలు చేపట్టి న్యాయం చేయాలి.

– బాధితులు పి.మోహన్, రమాదేవీ, (సంగడి గుంట), పద్మావతి (మంగళదాస్‌నగర్), షేక్.షమీమ్, షేక్.ఉల్షన్ (ముఫ్తీ వీధి), గోపీచంద్ (ఏటుకూర్ రోడ్) గుంటూరు టౌన్.

అర కోటికి మోసం..

విజయవాడ సింగ్‌నగర్‌కు చెందిన ఓ బ్రోకర్, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే వ్యక్తి 2022లో పరిచయ మయ్యారు. గుంటూరు ఇన్నర్‌రింగ్‌రోడ్ రెడ్డిపాలెంలో స్థలం ఉందని వారిద్దరూ నమ్మబలికారు. దీంతో 102 గజాలు, మరో 117 గజాల స్థలాన్ని విక్రయించారు. ఒకరికి విజయవాడ, మరోకరికి గుంటూరు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయించారు. దీంతో ఇద్దరం వేర్వేరుగా కలిసి రూ.50 లక్షలు వారికి చెల్లించాం. ఇక ఆ స్థలాలపై బ్యాంక్ నుంచి రుణం పొందాం. అనంతరం బ్యాంక్ అధికారులు రీసర్వే చేయగా రెడ్డిపాలెంలో స్థలాల్లేవని గుర్తించారు. దీంతో బ్యాంక్ నుంచి పొందిన రుణం తిరిగి చెల్లించాలని నోటీసులు జారీచేశారు. ఈ విషయమై బ్రోకర్, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే వ్యక్తిని అడిగితే సరైన సమాధానం లేదు. మీరే న్యాయం చేయాలి సార్...

– కె.విజయకుమార్ రెడ్డి, జి.సత్యనారాయణ, నూజివీడు

రాజీకి రానన్నాడని హతమార్చారు

తూమూలూరులో వ్యక్తి దారుణ హత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న తెనాలి డీఎస్పీ రమేష్, సీఐ వెంకటేశ్వర్లు

తూములూరు(కొల్లిపర): పాత కేసు విషయంలో రాజీ పడనందున ఓ వ్యక్తిని ప్రత్యర్థులు హతమార్చిన ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ రవీంద్ర రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని తూములూరు గ్రామానికి చెందిన నాలాది సాంబశివ రావు (35) అదే గ్రామానికి చెందిన సమ్మెట ఆంజనేయలు కుటుంబ సభ్యుల మధ్య పాత కేసులు ఉన్నాయి. దీనిపై కోర్టులో విచారణ జరుగుతోంది. అయితే కేసు విషయంలో రాజీకి రావటం లేదని భావించిన సమ్మెట ఆంజనేయలు, అతని భార్య భూలక్ష్మి, మరోక వ్యక్తి చాగంటి శేఖరరెడ్డిలతో కలసి దావులూరు అడ్డరోడ్డు వద్ద ఆదివారం రాత్రి సాంబశివరావును హతమార్చినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ రమేష్, సీఐ వెంకటేశ్వర్లు సోమవారం ఉదయం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం వివరాలు సేకరించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి వైద్య శాలకు తరలించారు. ఇదిలా ఉంటే నిందితులను తక్షణమే అరెస్టు చేసి మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ దళిత సంఘాలు బడ్డీకొట్టును తగల బెట్టి ధర్నా నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు తెనాలి కౌన్సిలర్ గడ్డేటి సురేంద్ర, మాల యువసేన రాష్ట్ర అధ్యక్షులు న్యాయవాది పొందుగుల చైతన్య, మాల యువసేన రాష్ట్ర కార్యదర్శి పెరికల రమణయ్య, దళిత సంఘం నాయకులు పాల్గొన్నారు.

గుంటూరులో దారుణం...


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ

పట్నంబజారు: గుర్తుతెలియని వ్యక్తిని బండరాయితో తలపై మోది హత్య చేసిన ఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లాలాపేట పోలీసు స్టేషన్ పరిధిలోని ఏలూరు బజారు రెండో లైను, చేపల మార్కెట్ సమీపంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తిని గుర్తుతెలియని దుండగులు బండరాయితో తలపై మోది హతమార్చారు. సదరు మృతుడు ఇదే ప్రాంతంలో తిరుగుతుంటాడని స్థానికులు తెలిపారు. కొంత మంది వ్యక్తులతో కలిసి నిత్యం సంచరిస్తుంటాడని, అయితే వారి మధ్య ఏదైనా వివాదం నేపథ్యంలో హత్య జరిగి ఉంటుందా అని విచారిస్తున్నట్లు లాలాపేట పీఎస్ సీఐ పి.దేవప్రభాకర్ చెప్పారు. మృతుడికి సంబంధించి ఎటువంటి వివరాలు తెలియరాలేదని, కేవలం చేతిపై అమ్మ, గుర్రం పచ్చబొట్టు ఉన్నట్లు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 35 నుంచి 40 సంవత్సరాల ఉంటుందన్నారు. మృతుడి ఆచూకి తెలిసిన వారు 8688831311, 8688831313కు సంప్రదించాలని సూచించారు.

కార్పొరేషన్ ఉపాధ్యాయుడు సస్పెన్షన్

గుంటూరు ఎడ్యుకేషన్: ఒకటో తరగతి విద్యార్థులను వాతలు తేలేలా కొట్టిన సంఘటనకు బాధ్యుడైన ఉపాధ్యాయుడు పి.లక్ష్మీనారాయణను సస్పెండ్ చేస్తూ డీఈవో పి.శైలజ సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. సంజీవయ్యనగర్‌లోని పినపాటి ప్రభుదాస్ నగర పాలకసంస్థ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న రమావత్ జోసఫ్‌రాజు నాయక్, సుకన్యారాజు నాయక్‌ను రెండు రోజుల క్రితం ఎస్జీటీగా పని చేస్తున్న లక్ష్మీనారాయణ బెత్తంతో కొట్టడంతో వీపుపై వాతలు తేలాయి. జరిగిన సంఘటనపై ఎంఈవో ద్వారా నివేదిక తెప్పించుకున్న డీఈవో శైలజ సోమవారం స్వయంగా పాఠశాలకు వెళ్లి విచారణ జరిపారు. అనంతరం ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ సోమవారం సాయంత్రం ఉత్తర్వులు ఇచ్చారు.

సీఎం వైఎస్ జగన్ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు

- బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ
- వేజండ్లలో ఒక్కరోజే 1475 మందికి నేత్ర, హృద్రోగ పరీక్షలు


వైద్య పరీక్షలు చేయించుకున్న వేజండ్ల గ్రామస్తులతో అంబటి మురళీకృష్ణ

వేజండ్ల(చేబ్రోలు): ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అందిస్తున్న సంక్షేమ ఫలాలను స్ఫూర్తిగా తీసుకొని 'బజరంగ్ జగన్నామ సంక్షేమ సంగమం 'కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ అన్నారు. చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామంలో సోమవారం జగన్నామ సంక్షేమ సంగమం వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరానికి 1475 మంది గ్రామస్తులు తరలిరాగా నిపుణులైన వైద్యులు కంటి పరీక్షలు, గుండె పరీక్షలు చేశారు. వీటితో పాటు ఫిజియోథెరపీ సేవలను అందించారు. వీరిలో 20 మందికి యాంజియోగ్రామ్ పరీక్ష అవసరమని వైద్యులు సూచించారు. శిబిరం అనంతరం బజరంగ్ విద్యా విజేత కార్యక్రమంలో భాగంగా స్థానిక జడ్పీ హైస్కూల్‌లోని 650 మంది విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్‌ను అందజేశారు. కార్యక్రమం ప్రారంభోత్సవంలో అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ ఉచిత నేత్ర వైద్య పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఏడు పని దినాల్లో కళ్లజోళ్ల పంపిణీ చేస్తామన్నారు. గుండెకు సంబంధించి యాంజియోగ్రామ్ పరీక్ష అవసరమైన వారిని బుధవారం ఉదయం ప్రత్యేక బస్సులో విజయవాడ తీసుకువెళ్లనున్నట్టు వివరించారు. శిబిరానికి వచ్చిన దివ్యాంగులకు ట్రై సైకిల్స్, జైపూర్ కాలు, వెస్ట్రన్ కమోడ్‌లు అందిస్తామన్నారు. ప్రత్యేక వాహనాల ద్వారా వృద్ధులు, మహిళలు, వికలాంగులను శిబిరానికి తీసుకువచ్చి, పరీక్షలు నిర్వహించి తిరిగి పంపించటానికి ఏర్పాటు చేయటం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బత్తుల అనూరాధ, పొన్నూరు జడ్పీటీసీ సభ్యులు కర్లపూడి రమేష్, నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షుడు వట్టిగుంట నాగిరెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ ఆళ్ల శ్రీరామిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు షేక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అంశాలపై అవగాహన ఉండాలి: జేసీ

గుంటూరు వెస్ట్: మారుతున్న ఆధునిక ప్రపంచంలో ఆర్థిక అంశాలపై సంపూర్ణ అవగాహన ఉండాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ సైబర్, డిజిటల్ లావాదేవీలు నేడు తప్పనిసరన్నారు. వీటిని తెలుసుకుంటే ఇబ్బందులుండవని జేసీ సూచించారు.

నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో డైనింగ్ హాల్


డైనింగ్ హాలును ప్రారంభిస్తున్న నాట్కోచైర్మన్ వి.సి.నన్నపనేని, వైస్ చైర్మన్ సదాశివరావు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో నూతనంగా రూ.10 లక్షలతో నిర్మించిన డైనింగ్ హాల్‌ను సోమవారం నాట్కో ఫార్మ వ్యవస్థాపకులు, చైర్మన్ వీసీ నన్నపనేని, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. క్యాన్సర్ సెంటర్‌కు అదనంగా కేటాయించిన స్థలంలో వసతులు ఏర్పాటుపై వీ.సీ. నన్నపనేని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్, వివిధ విభాగాధిపతులతో చర్చించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఈ క్యాన్సర్ సెంటర్‌కు రోజుకు వందలాది మంది క్యాన్సర్ రోగులకు సేవలు అందిస్తున్నదని, ప్రభుత్వ ఆసుపత్రి నాట్కో క్యాన్సర్ సెంటర్ కార్పొరేట్ ఆసుపత్రిగా ఎదిగిందని చెప్పారు. ఆసుపత్రిలో పని చేసే సిబ్బందికి డైనింగ్ హాలును అందుబాటులో తీసుకుని రావడమే కాకుండా ఎంతో అందంగా తీర్చిదిద్దారని తెలిపారు. స్కూల్ ఆఫ్ నర్సింగ్ భవనం నిర్మించాలని కోరుతూ డాక్టర్ కిరణ్ కుమార్ నన్నపనేని వెంకన్న చౌదరికి వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ దుర్గా ప్రసాద్, డాక్టర్ శివరామకృష్ణ, డాక్టర్ వెంకట రెడ్డి, డాక్టర్ జాహ్నవి, డాక్టర్ మురళి, డాక్టర్ శ్రీనివాస్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆషా సజని, నాట్కో వైస్ చైర్మన్ నన్నపనేని సదాశివ రావు, సమన్వయ కర్త యడ్లపాటి అశోక్ కుమార్ పాల్గొన్నారు.

బెల్ట్ షాప్ నిర్వాహకుల అరెస్టు

నగరంపాలెం: గొలుసు దుకాణాలు (బెల్ట్ షాప్) నిర్వహించే నలుగుర్ని, ఒక సూపర్‌వైజర్‌ను ఎస్ఈబీ (సెబ్) స్టేషన్ గుంటూరు–1 పోలీసులు అరెస్ట్ చేశారు. రూ.2.20 లక్షలు ఖరీదు చేసే 143 మద్యం (క్వార్టర్) సీసాలు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు బ్రాడీపేటలోని సెబ్ స్టేషన్–1లో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో సెబ్ ఏఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు కేసు వివరాలను సెబ్ గుంటూరు సూపరింటెండెంట్ ఎల్.రంగారెడ్డి, ఏఎస్ ఎస్.కృష్ణకిషోర్‌రెడ్డి, స్టేషన్–1 సీఐ పి.విజయ్‌కుమార్‌తో కలిసి ఆయన వెల్లడించారు.